# మేఘదాహం

సిరి సంపదలకు పుట్టినిల్లయిన ఓ రాజ్యంలో వరసగా పదేళ్లు వర్షాలు లేకపోయేసరికి, ఆ రాజ్యానికి ఆయువుపట్టయిన నది ఎండిపోయింది. దేశంలో సంపదలు నశించి, అష్ట కష్టాలు ఆవరించాయి. గగన మేఘాలు వర్షించక పోయేసరికి, ప్రజల హృదయ మేఘాలు వర్షించసాగాయి.।

ఆ రాజ్యంలో ఒక వింత ఆచారం ఉండేది. అనావృష్టి ఏర్పడినప్పుడు—రాజ్యంలోని అందమైన యువతిని నదీ తీరంలో సజీవంగా సమాధి చేసినట్లయితే నదిలో జలప్రవాహం రాగలదని ప్రజల ప్రగాఢ విశ్వాసం!

ఆ కాలంలో రాజకుమారి జనని అందరిలోకీ అందాల రాశిగా. వాసికెక్కింది. దేశ ప్రజల కష్టాలు తీర్చడం కోసం రాజు తన కుమార్తెను త్యాగం చేయడానికి సిద్ధమయ్యాడు.

రాజకుమారి జనని సైతం తన ప్రాణ త్యాగానికి ఉత్సాహంగా ముందుకు వచ్చింది. తన మరణంతో తన దేశ ప్రజలకు ప్రాణం పోసే భాగ్యం కలిగినందుకు మురిసిపోతూ, మేనాలో నదీ తీరం చేరింది!

అనుకున్న ప్రకారం వరుణ పూజలు జరిగాక, తాపీ పనివాళ్లు రాకుమారి చుట్టూ రాళ్లు పేర్చసాగారు. అప్పుడామె వాళ్లతో, "అయ్యలారా! నా చుట్టూ రాళ్లు పేర్చండి. కాని నా కళ్లను, చేతులనూ మాత్రం కాస్త వదిలి పెట్టండి. ఎందుకంటే నాకు జన్మనిచ్చిన తల్లిదండ్రులు ఎప్పుడయినా ఇటు వైపు వస్తే వాళ్లకు చేతులెత్తి నమస్కరించాలి. నన్ను వెతుక్కుంటూ నా ప్రియుడు ఎప్పుడయినా ఇటువస్తే అతన్ని నా కళ్లారా చూసి నాలో నింపుకోవాలి," అని ప్రాధేయపడిందట!

వనితా మేఘాలు వర్షించే త్యాగ వర్షం వల్లే, మానవ జీవన స్రవంతులు జాలువారుతున్నాయనే ఉదాత్త సత్యాన్ని సూచన ప్రాయంగా తెలియజేస్తుంది ఈ గ్రీ జానపదకథ!

పెళ్లి పీటల మీద కూర్చున్న క్షణం నుంచీ, ఒక స్త్రీ చుట్టూ పేర్చబడే బాధ్యతలు ఎన్నెన్ని? ఆ బరువులన్నిటినీ మోస్తూ స్త్రీలు త్యాగాగ్నిలో నిలబడడం వల్లే కదా—మన సంసారాలలో ఆనందకుసుమాలు వికసిస్తున్నాయి!

మరి అటువంటి స్త్రీలకు మన సమాజంలో ఉన్న గౌరవం ఎటువంటిది? వర్షాన్నిచ్చే మేఘాలే దాహంతో తపించే విచిత్ర పరిస్థితి ఎలా వచ్చింది? మచ్చుకు మా పక్కింటి సుగుణ అనుభవాన్నే చూడండి—

అప్పుడే పుట్టిన తన బిడ్డను చూస్తుంటే సుగుణ హృదయం ఆనంద గగనంలో తేలే అనురాగ మేఘమయింది. ఆమె శరీరంలో కోటి వీణలు మీటినట్లయి, నరనరాన ఆనంద తరంగాలు ఉవ్వెత్తున లేచాయి.

పెళ్లయి అయిదేళ్లయినా, కడుపు పండకపోయేసరికి, ఇరుగు పొరుగు అమ్మలక్కలు గుస గుసలాడుకునే విధంగానే, తనకిక సంతాన భాగ్యం లేదేమో అనుకుంటూన్న తరుణంలో—తనను 'అమ్మా' అని పిలవడానికి తన కడుపున పుట్టిన బిడ్డను చూస్తూంటే—అందల మెక్కినంతగా సంబరపడిపోయింది సుగుణ!


సుగుణకి పాప పుట్టిందని తెలియగానే, బంధు మిత్రులందరూ ఆమెను పలకరించడానికి పోటీ పడి రాసాగారు. వచ్చినవారు, వచ్చీరాగానే,—"లేక లేక ఆడ పిల్లని కన్నావు? భలేదానివి త్వరగా అల్లుణ్ణి సంపాయిస్తావులే."

"అహ్ ఆదిలోనే మైనస్సా"

"మొదట ఆడపిల్లే పుట్టాలి సుగుణా! ఇంటికి లక్ష్మి లాంటిది. అయినా సంవత్సరం తిరిగేలోగా కొడుకును కనాలి చూసుకో."—అంటూ

వాళ్లు తెలియజేసిన అభినందనలు అభినందనల్లా లేవు సుగుణకు.

"అయ్యో! ఆడపిల్లనా కన్నావు! ఇక నీ గతేంకాబోతుందో," అని భయపెట్టే విధంగా, సానుభూతి కనబరచేవిలాగా, ఓదార్పు చెప్పే విధంగా ధ్వనించాయి.



వాళ్ల మాటలు వినడంతో సుగుణ మనస్సు క్రమంగా బరువెక్కసాగింది. తను ఆడ పిల్లను కనడమే అపరాధమా? అని ఆమె విచారించసాగింది.

రెండవ కాన్పులో మగ బిడ్డ పుట్టడంతో సుగుణను అందరూ ఆప్యాయతో అభినందించారు. ఆమె అదృష్టాన్ని ఆకాశానికెత్తారు. వాళ్ల ధోరణి ఆమెకెంతో వింతగా కనిపించింది.

"నాకు ఆడపిల్లపుడితే వీళ్లందుకుఘులా పాడలిపోవాలి? రెండోసారీ ఆడపిల్లే పుట్టి ఉంటే వీళ్ల ముందు నా గతేంకావాలి? నాకేమైనా రాజ్యముందా వారసుడు లేకపోతాడే అనే భయపడడానికి? పైగా మగ బిడ్డ పుట్టడంతోటే బతుకు బాగు పడిపోతుందని భావించడానికి గ్యారంటీ ఏముంది?" ఇలా తనలో తాను మధన పడసాగింది సుగుణ!

సుగుణకు కలిగిన అనుభవమే మన దేశంలో తల్లులందరికీ ఎదురవుతున్నది. ఆడపిల్లల తల్లి అనగానే ఇరుగు పొరుగుల ఉదాసీనతకూ, తోడి కోడళ్ల సూటిపోటి మాటలకూ, అత్తమామల ఆగ్రహానికీ, ఆఖరికి కట్టుకున్నవాడి బెదిరింపులకూ గురి కావలసి వస్తున్నది.

రెండవ కాన్పులో పుట్టే ఆడపిల్లను ఎలాగైనా వదిలించుకోవాలనే రాక్షస తపన కొన్ని ప్రాంతాల్లో ఉన్నట్టు పత్రికలు వార్తలుగా మోసుకొస్తున్నాయి.

పుట్టుకతోనే ఇలా ద్వేషానికి గురయ్యే ఆడజన్మ— పెంపకంలోనూ, చదువు సంధ్యల విషయంలోనూ తన తోబుట్టువుల మధ్యే పక్షపాతానికి గురికావడం మన జాతిని పీడించే మహమ్మారి జాడ్యం!

ఇవాళ కొన్ని నగరాలలో గర్భస్థ శిశువు—ఆడ, మగా అని తెలుసుకునే అమినో సెంటసిస్ విధానం అందుబాటులో ఉన్నది. దీని ద్వారా కడుపులో ఉన్నది పాప అని తెలియగానే, మొగ్గలోనే చిదిమేసే ప్రయత్నాలు దేశ వ్యాప్తంగా జరుగుతున్నాయి. పుట్టి పెరిగాక లక్షలు పెట్టి వరుణ్ణి కొనడంకన్నా పుట్టకముందే వందలతో వదిలించుకోవడం శ్రేయస్కరమన్న మనస్తత్వం చదువు కున్న వారిలోను ప్రబలుతున్నది.

దీనికంతా కారణం—ఆడపిల్ల పెళ్లి అంటే పెద్ద గండంగా పరిణమించడమే. పెళ్లి సంతలో మన ఆడపడుచులను నిలబెట్టి పాడే వేలం పాట—మనలోని మానవత్వం గొంతుకు ఉరిబిగించే రాక్షసక్రీడ!

ఇలా ఆడజాతి మౌనంగా ఆలపించే విషాద గీతికి మూలకారణం ఎవరు? ఏమిటి?

మనమూ, మన వ్యవస్థ!

ఇవాళ మన దేశంలో స్త్రీల సమస్య ఒక్కటే సమస్యకాదు. నిజం చెప్పాలంటే మన సమాజమే ఒక సమస్య. ఆ సమస్యలో ఒక భాగంగా, విష వృక్షంలో ఒక కొమ్మగా మాత్రమే స్త్రీల సమస్యను తీసుకోవాలి.

మన దేశంలో బిడ్డ పుట్టగానే సమస్య. మగపిల్ల వాడయినా వాణ్ణి స్కూల్లో చేర్పించడానికి లంచం, పరీక్షల్లో ప్యాసు చేయించడానికి లంచం. ఉద్యోగం ఇప్పించడానికి లంచం. ఆ పైన పెళ్లి ప్రస్తావన రాగానే ఆడపిల్ల తరఫు నుంచి వరకట్నం రూపంలో లంచం. ఇలా సమాజమంతా లంచం ఇరుసు మీదేనడుస్తుంటే కేవలం కాగితం మీద నిషేధించినంత మాత్రాన వరకట్నం అంతమైపోతుందా?

ఎదుటి వాణ్ణి ఎలా దోచుకోవడమన్నదే ఈనాడు ప్రతి ఒక్కడి తాపత్రయంగా ఉంటున్నది.

ఈ విషవలయం నుంచి బయట పడడానికి ఎన్నో ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. ఇటీవలి కాలంలో స్త్రీల హక్కులు పట్ల స్పృహ ఎక్కువవుతున్నది. ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో వచ్చిన ఎన్నో ఉద్యమాలూ, ఒత్తిడులూ— భారత స్త్రీ ఆర్థిక, సాంఘిక, రాజకీయ రంగాలలో ముందడుగువేయడానికి కారణభూతాలయ్యాయి. అయినా స్త్రీ జీవితంలో సంపూర్ణ ఆరోగ్యకరమైన మార్పు రావాలంటే దానికి ముందు వ్యవస్థాగతమైన మార్పు రావాలి. ఆ మార్పు కోసం ఒక్క వనితలే కాదు—ఆడా, మగా తేడా లేకుండా అందరూ కలిసి కట్టుగా పోరాడాలి!

—బాల

అస్తవ్యస్తమైన సామాజిక వ్యవస్థలో నిస్సహాయురాలిగా నిలబడలేక, వీరోచితంగా పోరాడడానికి శక్తి చాలక, జీవన సమరాన్ని కొనసాగించిన ఓ వనిత సంధించిన ప్రశ్నాశరం!

## "అన్నల్లారా! నా తప్పేమిటి?"

వివిధ సమస్యల కారణంగా జీవితంలో సుఖశాంతులు కోల్పోయిన వ్యక్తుల పట్ల సానుభూతి చూపవలసిన సమాజం—వారిపై పగబూనినట్లు వ్యవహరిస్తే, వాళ్ల పరిస్థితి ఏవిధంగా వుంటుంది?

సంఘసేవకు జీవితాన్ని అంకితం చేసినవారు, మానవసేవే మాధవసేవగా భావించేవారు—తమ కర్తవ్య నిర్వహణలో ఎటువంటి సమస్యలు ఎదుర్కోవలసి వస్తుంది?

రక్షకులే భక్షకులుగా తయారైతే, దీనుల మనుగడ ఏమౌతుంది?

సమకాలీన సమాజాన్ని కొత్తకోణంలో

విశ్లేషిస్తున్న మరో సశేష నవల—

సుప్రసిద్ధ రచయిత్రి శ్రీమతి కె.రామలక్ష్మి

రచన

"అన్నల్లారా!
నా తప్పేమిటి?"

వచ్చే సంచిక నుంచీ ప్రారంభం!